జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 18-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 758 పేజీలు: 4 వెల: రూ.7



# చింతాడ రవికి.. బెయిల్



✳ మరో 24 మందికి కూడా ✳ షరతులతో కూడిన బెయిల్ మంజూరు ✳ రెండు నెలలు పాటు ప్రతి శనివారం స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాలని ఆదేశం ✳ బూర్జ ఎస్ఐ ప్రవల్లికపై దాడి కేసులో 26 మందికి ఊరట ✳ జైలు నుంచి విడుదలైన రవి, అనుచరులు ✳ తాము ఎస్ఐ దాడి చేయలేదు: రవి

ఆమదాలవలస/శ్రీకాకుళం, ఆగస్టు 17 (వార్త): బూర్జ ఎస్ఐ ప్రవల్లికపై దాడి కేసులో జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆమదాలవలస వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌తో పాటు మరో 24 మందికి సోమవారం బెయిల్ మంజూరైంది. కొత్తరోడ్డు సమీపంలో విధుల్లో ఉన్న ఎస్ఐ ప్రవల్లికపై దాడి ఘటనలో 27 మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇద్దరికి శుక్రవారం బెయిల్ మంజూరు చేసిన ఆమదాలవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.రమ్య సోమవారం మిగిలిన 25 మందికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. బెయిల్‌పై విడుదలైన నిందితులు రెండు నెలలు ప్రతి శనివారం ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో హాజరై సంతకాలు చేయాల్సి ఉంటుందని, లేదా పోలీసులు కేసుకు సంబంధించిన చార్జిషీట్ నివేదికను కోర్టుకు సమర్పించేటంత వరకు షరతులు వర్తిస్తాయని న్యాయాధికారి ఆదేశించారు. దీంతో ఈ కేసుకు సంబంధించి చింతాడతో పాటు 26 మందికి కోర్టులో ఊరట లభించింది.

### మహిళా ఎస్ఐపై దాడి అబద్ధం

మహిళా ఎస్ఐపై దాడి చేశాననే ఆరోపణలు అబద్ధమని ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయన సోమవారం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గతనెల 30న మాజీ మంత్రి అప్పలరాజును పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి జిల్లాకు వచ్చారని.. ఆమదాలవలస పరిధిలోని కొత్తరోడ్డు జంక్షన్ వద్ద వేలాది మంది జనం తరలిరాగా ఆ రద్దీలో ఎస్ఐ ప్రవల్లిక అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ఆమె ఆరోగ్యం దృష్ట్యా మానవత్వంతో పక్కకు తీసుకువెళ్లాము తప్ప ఆమె పట్ల ఎలాంటి అగౌరవం గానీ, దాడి గానీ జరగలేదన్నారు. అయితే అధికార టీడీపీ నాయకులు వారి సోషల్ మీడియాలో ఒక మహిళను అడ్డుపెట్టుకుని తమపై బురదజల్లే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎలాంటి డ్రగ్ అనాలసిస్, నార్కోటిక్ టెస్టులకైనా తాము సిద్ధమని పేర్కొన్నారు.





# చెరువు మింగేసింది!

✳ చెరువుకు వెళ్లి శవమై తేలిన విద్యార్థి ✳ కురుడు బీసీ బాలుర హాస్టల్‌లో చదువుతున్న దుర్గా ప్రసాద్ ✳ వసతి గృహ అధికారుల తీరుపై విద్యార్థి కుటుంబీకుల ఆగ్రహం ✳ విద్యార్థి మృతి ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఆగస్టు 17 (వార్త): కోటబొమ్మాళి మండలం కురుడు బీసీ బాలుర వసతిగృహంలో ఆరో తరగతి చదువుతున్న ముద్దాడ దుర్గాప్రసాద్ (11) సమీపంలోని మెండవాని చెరువుకు ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి పడి మృతి చెందివుంటాడని పలువురు భావిస్తున్నారు. రాత్రయినా తిరిగి ఆ విద్యార్థి హాస్టల్‌కు రాలేదు. అమ్మమ్మ ఊరు సరియాపల్లి వెళ్లివుంటాడని హాస్టల్ సిబ్బంది భావించారు. కాగా సోమవారం ఉదయం సరియాపల్లికి చెందిన దుర్గాప్రసాద్ సమీప బంధువు ఒకరు వసతిగృహానికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన మరో విద్యార్థికి.. దుర్గాప్రసాద్ కోసం అడగ్గా.. సోమవారం సాయంత్రం నుంచి హాస్టల్‌లో లేడని చెప్పాడు. అమ్మమ్మ గారింటికి రాలేదా? అని అడిగాడు. ఈ విషయం తాతయ్య జులమూరు సింహాచలం, అమ్మమ్మ అప్పలనరసమ్మకు ఆ వ్యక్తి తెలియగా వారు ఆందోళన చెందారు. దుర్గాప్రసాద్ ఎక్కడికి వెళ్లాడో తెలియక కలవరపడ్డారు. గ్రామస్థులు సమీప ప్రాంతాలు వెతకగా.. మెండవాని చెరువులో దుర్గాప్రసాద్ మృతదేహం కనిపించింది. దీంతో అమ్మమ్మ, తాత, బంధువులు బోరున విలపించారు. వార్డెన్ తమకు సమాచారం ఇవ్వలేదని వారు ఆరోపించారు. దీనిపై వార్డెన్ లక్ష్మణరావు వద్ద ప్రస్తావించగా.. పలుమార్లు దుర్గాప్రసాద్ తల్లిదండ్రులకు ఫోన్ చేయగా.. వారి ఫోన్ పనిచేయలేదని తెలిపారు. దుర్గాప్రసాద్ తాత సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వార్డెన్ లక్ష్మణరావు ఇచ్చిన సమాచారం మేరకు ఏఎస్‌డబ్ల్యువో త్రినాథరావు ఘటన స్థలానికి చేరుకుని వార్డెన్ నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం తీసుకున్నారు. దుర్గాప్రసాద్ స్వగ్రామం మాసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురం. తల్లిదండ్రులు ముద్దాడ జయరాం, భవానీ హైదరాబాద్‌లో వలస కూలీలుగా పని చేస్తున్నారు. దుర్గాప్రసాద్ కుమారుడు వసతి గృహంలో ఉంటూ కురుడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కాగా, విద్యార్థి మృతి ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి.. నివేదిక అందజేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారికి ఫోన్‌లో ఆదేశించారు. బీసీ హాస్టల్ విద్యార్థి మృతి బాధాకరమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ ప్రమాదంపై తక్షణమే నివేదిక అందజేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. విద్యార్థుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టల్, గురుకుల విద్యార్థుల రక్షణే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# అవినీతి ముద్ర తొలగింది

✳ పాతికేళ్ల పోరాటానికి ఊరట
✳ హైకోర్టు తీర్పు అమల్లోకి! ✳ శ్రీకాకుళం బీట్ ఆఫీసర్‌పై కేసు కొట్టివేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

శ్రీకాకుళం, ఆగస్టు 17 (వార్త): అవినీతి ఆరోపణలతో పాతికేళ్లుగా సాగిన సుదీర్ఘ న్యాయపోరాటంలో చివరకు నిజమే గెలిచింది. శ్రీకాకుళం జిల్లా ధర్మవరం బీట్ ఆఫీసర్ (ఫారెస్ట్ గార్డ్) సేనాపతి రామకృష్ణపై మోపిన అవినీతి నిరోధక శాఖ కేసును హైకోర్టు కొట్టివేయడంతో, ఆ ఉత్తర్వులను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది.




### అసలేం జరిగిందంటే...

ఈకేసు వివరాల్లోకి వెళ్తే... 2000 సంవత్సరంలో టేకు కలప వ్యవహారంలో ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో ధర్మవరం బీట్ ఆఫీసర్ రామకృష్ణపై ఏసీబీ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టింది. ఆ తదనంతర పరిణామాల్లో విశాఖపట్నం ఏసీబీ ప్రత్యేక కోర్టు 2007లో ఆయనకు శిక్ష ఖరారు చేసింది. కోర్టు తీర్పు ఆధారంగా నాటి అటవీశాఖ అధికారులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ డిస్మిస్ నిర్ణయం తీసుకున్నారు.

హైకోర్టులో పిటిషన్... తీర్పు అనంతరం ఉత్తర్వులు విశాఖ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ రామకృష్ణ ఏపీ హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ (నంబర్. 562/2007) దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై సమగ్ర విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం... ప్రాథమిక ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని, నిందారోపణలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని స్పష్టం చేస్తూ క్రిమినల్ అప్పీల్‌ను అనుమతించి, ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ఏసీబీ విభాగం కూడా ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు ప్రాతిపదికలు లేవని స్పష్టం చేయడంతో, హైకోర్టు ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు (జీవో ఆర్టీ నెంబర్. 94) జారీ చేశారు. దీంతో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రామకృష్ణకు పూర్తి న్యాయం చేకూరినట్లయింది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మాజీ సర్పంచ్‌కు కుమరాపు పరామర్శ



**జి.సిగడాం, ఆగస్టు 17(వార్త):** మెట్టవలస గ్రామ మాజీ సర్పంచ్ కామోజుల సీతారాంనకు ఆకస్మాత్తుగా ప్రమాదావశాత్తు ఇటీవల శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల టిడిపి అధ్యక్షులు కుమరాపు రవి కుమార్ అసుపత్రి నకు వెళ్లి అయెనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సిగడాం పీఏసీస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు,బాల,మాజీ సర్పంచ్లు, కూటమి నాయకలు ఉన్నారు.

# అక్రమ కేసులతో ప్రతిపక్షాలను అణచలేరు

- రెడ్‌బుక్ పాలన ఎన్నాళ్లో ఉండదు.. అధికారులు గమనించాలి...
- మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి
- సీదిరికి పరామర్శ



**పలాస, ఆగస్టు 17 (వార్త):** రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ధ్వజమెత్తారు. పౌర సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా పాలన సాగుతోందని విమర్శించారు. రెడ్‌బుక్ పాలన శాశ్వతం కాదని, అధికారులు విషయాన్ని గమనించాలని సూచించారు.

బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును, ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అప్పలరాజు స్వగృహంలో పుష్పశ్రీవాణి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాధ్యులను వదిలేసి బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా చిత్రీకరించారని, సీదిరి అప్పలరాజు విషయంలో చోటుచేసుకున్న ఘటన అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదమని పుష్ప-శ్రీవాణి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్పలరాజు కుమారుడు 108కు ఫోన్ చేసి సహాయం అందించేందుకు ప్రయత్నించారని చెప్పారు. ప్రభుత్వం రాజకీయ కక్షతో ఘటనను తీవ్రమైన హత్య కేసుగా చిత్రీకరించి అక్రమంగా అరెస్టు చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో చట్టాలు, న్యాయం వ్యక్తులను బట్టి మారుతున్నాయా? అని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, వారి అనుచరుల వాహనాలతో ప్రమాదాలు జరిగినప్పుడు నమోదైన కేసులు, వైఎస్సార్‌సీపీ నేతలపై పెడుతున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయని, కూటమి ప్రభుత్వంలో కొందరు అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని పుష్పశ్రీవాణి ఆరోపించారు. మంత్రులు తమ శాఖల పాలనను పట్టించుకోకుండా ఉదయం నుంచి రాత్రి వరకు వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేయడానికే పరిమితమవుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ సీదిరి అప్పలరాజు కుటుంబానికి అండగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను కేసులు, అరెస్టులతో అణచివేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనతాపత్రిక వ్యవస్థాపకులు ఇంజరాపు జయదేవ్, వైసీపీ ప్రచార కార్యదర్శి పైల వెంకటరమణ చిట్టి), వైసిపి పలాస పట్టణ అధ్యక్షులు శిస్టు గోపి, మండల పార్టీ అధ్యక్షులు దువ్వాడ రవి, వైఎస్సార్సీపీ పలాస నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత పండా, వైసిపి నాయకులు బడగల బల్లయ్య, జల్లు ఉషా రాణి, పలువురు పార్టీ నాయకులు, వైసీపీ అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మందసను కరువు మండలంగా ప్రకటించాలి



- మహేంద్ర, చైతన్య రైతు సంఘాల డిమాండ్

**మందస, ఆగస్టు 17(వార్త):** మందస మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మహేంద్ర రైతు సంఘం, చైతన్య రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మందస తహసీల్దార్ బి.శ్రీహరిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఎలినినో ప్రభావంతో ఇప్పటి వరకు కురిసిన వానలు సాధారణ వర్షపాతం కన్నా 50శాతం తక్కువగా ఉన్నందున రైతులు వేసిన పంటలు వరినారులు, వెదలు పూర్తిగా పాడయ్యాయన్నారు. తక్కువ రోజుల్లో పండే పంటలు వరి విత్తనాలు రైతులకు సరఫరా చేయాలని, అలాగే అపరాలు చోడి, కంది, కొర్రలు, సామలు, అరికెలు తదితర చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు విత్తనాలను ఉచితంగా అందించాలన్నారు. మందస మండలంలో అనేక నీటి వనరులు ఉన్నా రైతులకు పంటలకు అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దీంతో కరువు పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదివరకు ప్రభుత్వం పంటల బీమా రుసుము చెల్లించేదని, నేడు రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని ఆదేశిస్తున్నారన్నారు. కరువుతో అల్లాడుతున్న రైతులకు అదనపు భారం వేసి కునుకుతున్న నక్కపై తాటిపండు పడ్డట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్దానపు పంటలు జీడి, కొబ్బరి మొక్కలను రైతులకు అందించాలని, ఉద్యానవనాభివృద్ధి నిధులు కేటాయించాలని కోరారు. మందస మండలంలో వర్షపాతం నమోదు యంత్రం ఒక్క మందస పట్టణంలోనే కాకుండా మండలంలోని మైదాన ప్రాంతం, గిరిజన ప్రాంతం, ఉద్దాన ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేసి సగటు వర్షపాతం లెక్కించి చూపాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతుసంఘ అధ్యక్షులు బెస్తకామేశ్వరరావు, మామిడి మాధవరావు, శిస్టు బాబూజీ, బోందల వెంకటరమణ, దుంపల జానకిరావు, మజ్జి బాబురావు, డొక్కరి వీరాస్వామి, కొర్ల హేమరావుచౌదరి, సిద్ధిగాం మాజీ సర్పంచ్ బొంగి మల్లేసు, వల్లభ ముఖర్జి, బొంగి దశరధ, మళ్ళ వాసుదేవు, బొంగి కామేసు, మళ్ళ కాళీ తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో ..
# గిరిజన విద్యార్థిని మృతి

- నాటు వైద్యం చేయడంతో చికిత్స ఆలస్యం
- కొనఊపిరితో హరిపురం సీహెచ్ సీకి తరలింపు
- చికిత్సపొందుతూ మృతి



**మందస, ఆగస్టు 17(వార్త):** మందస మండలంలోని చీపి అనే గిరిజన గ్రామానికి చెందిన యాజక తేజస్విని(8) అనే విద్యార్థిని మరణించింది. మండల కేంద్రమైన మందసలో తేజస్విని మూడవ తరగతి చదువుతోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీపి గ్రామానికి చెందిన నవీన్, నీలవేణి దంపతుల కుమార్తె హారతి, తేజస్విని, కుమారుడు ముఖేష్ ఆదివారం రాత్రి ఇంటిలో నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో తేజస్విని ఏడవంతో తల్లిదండ్రులు నిద్ర మేల్కొన్నారు. పాము కాటిసిందని, గుర్తించారు. ఇంటిలో చూడగా.. పాము ఓ ఎలుక కూడా కాటేయ్యడంతో అది కూడా చనిపోయి కనిపించడంతో విష సర్పం కాటేసిందని నిర్ధారించుకున్నారు. చీకటితో పాటు గిరిజన ప్రాంతం కావడంతో వారు నాటు వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కొన ఊపిరితో ఉన్న తేజస్వినికి చికిత్స అందిస్తుండగా, మరణించింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. తేజస్విని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థిని తేజస్విని మరణంతో చీపిలో విషాయఛాయలు అలముకున్నాయి.

## కళ్ల ఆరోగ్యమే..
# విద్యార్థుల బలం

**కొత్తూరు, ఆగస్టు 17 (వార్త):** కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని శ్రీమతి వి. సునీత విజ్ఞానభారతి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య 228 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. పరీక్షల్లో 14 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కంటి పరీక్షల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విటమిన్-ఏ సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకుంటూ కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మంచి చూపుతో విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు ఎదిగి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఐ

ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య విద్యార్థులకు కంటి సంబంధిత వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కంటి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ నీలిమ, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్త గౌరీ తదితరులు పాల్గొన్నారు.



## స్వదేశీ మత్స్యకారుల
# సమస్యలు పరిష్కరించాలి




**ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (వార్త):** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం మండలంలోని ఇన్‌లాండ్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీ పరిధిలో మత్స్యకారుల సమస్యలపై స్థానిక రోటరీ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంద్ర కుల మత్స్యకారుల సమస్యలపై రాష్ట్ర మత్స్యకార అధ్యక్షులు నద్ది కుట్టి అర్జున్, రాష్ట్ర మత్స్యకార జనరల్ సెక్రటరీ చింతకాయల ముత్యాలు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. మత్స్యకారుల ప్రధాన డిమాండ్లను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి సంవత్సరం జూలై లేదా ఆగస్టు నెలల్లో ఇన్‌లాండ్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీలకు ఉచితంగా చేప పిల్లలను సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. చేపలను చెరువుల నుంచి మార్కెట్లకు తరలించేందుకు 90 శాతం సబ్సిడీపై ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ఐస్ బాక్సులు, వలలు తదితర పరికరాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్ఛాపురం, ఈదుపురం, కవిటి, గొల్లవూరు, వడ్డీతాంద్ర, శ్రీకూర్మం గ్రామాల తంపరలు, సముద్రానికి ఆనుకుని ఉన్న భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులను తొలగించాలని కోరారు. ఇన్‌లాండ్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీల పరిధిలోని చెరువుల లీజు కాలాన్ని మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలకు పొడిగించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలోని చెరువులను రాష్ట్ర మత్స్యశాఖ ద్వారా ఇన్‌లాండ్ ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీలకు లీజుకు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని సాంప్రదాయ మత్స్యకారులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

కొన్ని గ్రామాల్లో మత్స్యకార సంఘాలు ఉన్నప్పటికీ సభ్యత్వ సమస్యల కారణంగా ప్రభుత్వం అందిస్తున్న 50 సంవత్సరాల వయస్సు పైబడిన మత్స్యకారుల పింఛన్/పథక ప్రయోజనాలు అందడం లేదని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి అర్హులైన మత్స్యకారులకు ప్రయోజనాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో దళిత కంద్ర మత్స్యకారుల అధ్యక్షుడు కమలోచన బెహరా, కార్యదర్శి హాన్ రావు, వైస్ ప్రెసిడెంట్ కారుణ్య ధర్మారావు, మాజీ అధ్యక్షుడు మోహన్, జి. రామచంద్ర, జిల్లా డైరెక్టర్ దీపక్ చంద్రయాన్, కార్యదర్శి దేవరాజుతో పాటు సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

### రాజ్యాధికారమే లక్ష్యంగా..

# మత్స్యకారులంతా ముందుకు సాగాలి

## - రాష్ట్ర అధ్యక్షుడు నడకుదుట అర్జున



**ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (వార్త):** రాజ్యాధికారం లక్ష్యంగా మత్స్యకారులు ముందుకు సాగాలని మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నడకుదుట అర్జున అన్నారు. ఇచ్ఛాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇచ్ఛాపురంలో జరిగిన చారిత్రక సమావేశం కంద్ర మత్స్యకార కులం ఆధ్వర్యంలో సాంప్రదాయపరచకార కులాల సమాఖ్య ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల 14 మత్స్యకార ఉపకలాలను ఐక్యమత్యంగా ఉంచడం తద్వారా మత్స్యకారుల అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమం తద్వారా మత్స్యకారులకు రాజ్యాధికారం రావాలని ఆ దిశగా 14 మత్స్యకార ఉప కులాలు మత్స్యకార ఐకమత్యంగా ముందుకు సాగాలని ఏ ఉపకలానికి ఏ సమస్య వచ్చినా సాంప్రదాయ మత్స్యకార సమాఖ్య వారి వెంట ఉంటుందని ఆ సమస్య తీరేంతవరకు రాష్ట్ర కమిటీ నాయకులందరూ కూడా న వెంట ఉండి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి మత్స్యకారులకు రావాల్సిన నిధులు అధికారాలు సంక్షేమ పథకాలు సాధనకై అందరూ నడుం బిగించాలని కోరారు. మత్స్యకార సమాఖ్యకి చేయూతనివ్వాలని అర్జున మత్స్యకారు సమాజానికి పిలుపునిచ్చారు. స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో ఆంధ్ర ఒడిస్సా బోర్డర్లో వెనుకబడిన కంద్ర మత్స్యకార సోదరీ సోదరీమణులు అందరూ వందలాదిగా తరలివచ్చి ముందుగా కంద్ర మత్స్యకార గ్రామంలో పర్యటించి ఒక మత్స్యకారుడి ఇంట్లో ఇచ్చిన దేనేటి విందును స్వీకరించి వారి స్థితిగతులు ఆ యొక్క కుటుంబ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మత్స్యకార గ్రామం నుంచి ర్యాలీగా బయలుదేరి గ్రామ పురవీధులలో ర్యాలీ చేసి సమావేశ మందిరం వద్ద రాష్ట్ర సాంప్రదాయమత్స్య కారుల సమాఖ్య జెండా ఎగరవేసి తదుపరి సమావేశాన్ని ప్రారంభించి మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కూలంకషంగా చర్చించి సభకు వచ్చిన వక్తలు తెలియజేసిన సమస్యలను జిల్లా స్థాయిలోనూ రాష్ట్ర స్థాయిలోనూ సంబంధిత అధికారులు దృష్టికి వెళ్లి పరిష్కరించుట కొరకు సభ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాల ,శ్రీకాకుళం జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు రాష్ట్ర ఆఫ్ కాఫ్ డైరెక్టర్ అయినటువంటి చీకటి శ్రీరాములు, జిల్లా కంద్ర మత్స్యకారు సంఘం అధ్యక్షులు కమలోచన ఉపాధ్యక్షులు కారుణ్య ధర్మారావు సాంప్రదాయ మత్స్యకార సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అనంత హనుమ రావు కార్యవర్గ సభ్యులకు మాజీ అధ్యక్షులు డి ఎఫ్ సి ఎస్ శ్రీహరి జిల్లా డి ఎఫ్ సి ఎస్ డైరెక్టర్ గురునాథ్ సాంప్రదాయ మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకులు తిత్తి సాయి బలరాం , చింతకాయల అప్పారావు , దీపక్ బెహరా మోహన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.ఇతర శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన మత్స్యకార 14 ఉప కులాలు కు చెందిన నాయకులు పాల్గొన్నారు.



### ఎస్ఐఆర్ నోటీసుపై

## సెప్టెంబర్ 21లోగా వివరణ ఇవ్వాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (వార్త):** ఎస్ఐఆర్ నోటీసు పై సెప్టెంబర్ 21 లోగా వివరణ ఇవ్వాలని తహశీల్దార్ వెంకట రావు కోరారు.హియరింగ్ డిస్క్రిపెన్సీస్, నో మ్యాపింగ్ కి సంబందించి షెడ్యూల్ ప్రాప్తికి పోలింగ్ స్టేషన్ ల వారి గా విచారణ చేపడుతున్నారని అన్నారు,ల్. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 21 వరకు జరుగుతుంది, నోటీసు అందినవారు నోటీసులో తెలిపిన తేదిన సమయం ప్రకారం సరియైన డాకుమెంట్స్ తో బి ఎల్ ఓ లకు తెలియ జేసిన ప్రదేశంనకు చేరుకొని సంబంధించిన అధికారులు ఎదుట హాజరు కావలసినదిగా తెలియజేశారు. షెడ్యూల్ ప్రాప్తికి కొలిగాం, మండపల్లి, అరకభద్ర, శాసనం, మునిభద్ర, ఇచ్ఛాపురం అర్బన్ లో ఒక్కో అధికారి 50 మందికి చప్పున హియరింగ్ చేయడం జరిగిందని చెప్పారు.

### ఇరువర్గాలపై

## కేసుల నమోదు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (వార్త):** బెల్లుపడ, త్రినాథ పేట, హరిజన వీధి దగ్గర జరిగిన కొట్లాటలో సచివాలయం ఉద్యోగి కొక్కిరి సుజిత్ పై జరిగిన దాడి కేసులో అతను ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ ఐ ఎం.ముకుంద రావు చెప్పారు. సుజిత్ కి ఆసి. గిరి కి మధ్య స్థల వివాదం ఉండగా ఆ స్థలంలో ఆసి. గిరి అతని బంధువులు మరో ఆరుగురు కలిసి జెసిబి, కటింగ్ మిషన్ లతో పనిచేయుస్తుండగా సుజిత్ ,అతని కుటుంబ సభ్యులు వెళ్లి అడుగగా కొక్కిరి సుజిత్ పై కటింగ్ మిషన్ తో దాడి చేయగా కాలుకు రక్త గాయమైనట్లు తెలిపారు. అతని అమ్మని చెల్లెలు లను చేతులతో కొట్టి తోసి వేసినట్లు ఫిర్యాదు చేశారు. ఇదే గొడవలో బడే గున్న ఇచ్చిన ఫిర్యాదు పై ఆమెపై కొక్కిరి శివ రావు అతని కుటుంబ సభ్యులు మరో ఆరుగురు కలిసి దాడి చేసి కొట్టినట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదు పై మరో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఉభయులు పైన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### టి.గంగువాడ పాఠశాల అభివృద్ధికి

## చిత్త వెంకటరావు రూ.5వేల విరాళం



**మందస, ఆగస్టు 17(వార్త):** మందస మండలంలో టి.గంగువాడ ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి చిత్త వెంకటరావు రూ.5వేలు అందజేశారు. విద్యాభివృద్ధికి, పాఠశాల మౌలిక వసతుల మెరుగుదలకు తన వంతు బాధ్యతగా భావించి, విరాళాన్ని అందించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాలే పునాదిని భావించి, పాఠశాల అభివృద్ధికి దాతృత్వంతో ముందుకు వచ్చిన చిత్త వెంకటరావుకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి మరింత మంది దాతలు, గ్రామస్థులు సహకరించి విద్యా వికాసానికి భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా హెచ్ఎం కోరారు.

### హేవీ విద్యుత్ లైన్ల..

## ప్రమాదాల నుంచి రక్షించండి



**మందస, ఆగస్టు 17(వార్త):** మందస మండలంలోని సిద్ధిగాం గ్రామానికి సంబంధించి కొన్ని ఇళ్ల మీదుగా పవర్ గ్రిడ్ లైన్ విద్యుత్ వైర్లు వేయడానికి సన్నహాలు జరుగుతున్నాయని, ఇవి అత్యంత ప్రమాదకరమని సిద్ధిగాం గ్రామ ప్రజలు అన్నారు. ఈ మేరకు మందస తహసీల్దార్ బి.శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. పవర్ గ్రిడ్ విద్యుత్ వైర్లు హేవీ లైన్ అని, వీటితో ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. గ్రామంపై నుంచి కాకుండా.. దూరంగా వేసి, ప్రమాదాలు జరుగకుండా కాపాడాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తానని తహసీల్దార్ శ్రీహరి వారికి చెప్పారు. కార్యక్రమంలో సిద్ధిగాం తెలుగుదేశం గ్రామపంచాయతీ ప్రధాన కార్యదర్శి మల్ల కళ్యాణ్ బాబు, పంచాయతీ అధ్యక్షుడు బొంగి శివకృష్ణ, మాజీ సర్పంచ్ లు గున్న రమణ, బొంగి మల్లేష్, మల్ల అప్పారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్లస్టర్ వారీగా సిబ్బంది ప్రోగ్రెస్‌పై సమీక్ష

**మందస, ఆగస్టు 17(వార్త):** మహిళా సంఘాలకు ప్రభుత్వం నిర్దేశించిన ఎంటర్ ప్రైనర్ గ్రౌండింగ్ ప్రగతిని వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ పరిధిలో గల వి.ఓ.ఏ.లను వారం, వారం గ్రౌండింగ్ ప్రోగ్రెస్ ను సమీక్ష జరిపి వెనుకబడిన సిబ్బందికి అవగాహన కల్పిస్తూ ప్రగతిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్నట్టు వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందసలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంత చెప్పినా అర్థం చేసుకోలేని సిబ్బంది స్థానం లో ప్రత్యామ్నాయ మార్గాలు తప్ప వని హెచ్చరించారు.

సంస్థాగత నిర్మాణం, కట్టుబాట్లు, పుస్తక నిర్వహణ మెరుగు పరచడం, సభ్యుల నైపుణ్యాలు పెంపొందించడం, మానవ వనరుల అభి వృద్ధి, యాక్టివిటీస్ తో పాటు ఉన్నతి, ట్రైకార్, అంతర్గత అప్పులు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజ్ తదితర రుణాలతో ఏర్పాటు చేసిన ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు కోసం ఏర్పాటు చేస్తున్న ఎంటర్ ప్రైనర్‌తో గ్రౌండింగ్ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, మందస క్లస్టర్ వీ.ఓ.ఏ.లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## లివర్ వ్యాధిగ్రస్తునికి క్లాస్‌మేట్లు ఆర్థిక సాయం



**మందస, ఆగస్టు 17(వార్త):** లివర్ వ్యాధితో బాధ పడుతున్న తోటి స్నేహితునికి సాయం చేశారు క్లాస్ మేట్స్. వజ్రపుకొత్తూరు మండలంలోని సీతాపురం గ్రామానికి చెందిన పోలాకి మురళి మోహన్ ఇటీవల కాలంలో లివర్ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యంతో గురయ్యారు. కుటుంబంలో ప్రధానంగా సంపాదన చేసే వ్యక్తి మంచాన పడడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యింది. నగరంపల్లిలో జడ్.పి.హెచ్.ఎస్(1990-1996)లో చదువుకున్న ఆయన క్లాస్మేట్ లందరూ తెలుసుకొని చేతనైనంతగా డబ్బులు వేసుకొని మురళీమోహన్ కు సీతాపురంలో కలసి రూ.25 వేల నగదు సాయం అందజేశారు. అదే విధంగా మరో క్లాస్ మేట్ కింతల తారకేశ్వరరావు(ఎక్స్ ఆర్మీ) 6000 రూపాయలు విలువ చేస్తే నిత్యావసర సరుకులను మురళీమోహన్ భార్య శోభారాణికి అందజేశారు. కార్యక్రమంలో ఎన్.మోహనరావు, బి.లక్ష్మీపతి, జగదీశ్వరి, తారకేశ్వరావు, కృష్ణ, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఏపీయూడబ్ల్యూజేతోనే జర్నలిస్టుల సంక్షేమం సాధ్యం

**పలాస, ఆగస్టు 17 (వార్త):** జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నిరంతరం కృషి చేస్తోందని ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు డి. మహారణ అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పలాస జర్నలిస్ట్స్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డి. మహారణ మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు, ఇంకా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాని వారికి కార్డులు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న విలేకరుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొంచాడ రవి, పలాస జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నేతాజీ, పలాస-కాశీబుగ్గ ప్రింట్ మీడియా అధ్యక్షులు అంది రామకృష్ణ (రాము), కిషోర్, సురో, జగన్, నాగరాజు, మేఘన, రత్నాల రమేష్, మోసా ప్రసాద్, సుభాష్ చంద్రబోస్, దినేష్ పండా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మెగా యూత్ ఫోర్స్ జిల్లా కో-కన్వీనర్‌గా కంచరాన

**మందస, ఆగస్టు 17(వార్త):** మెగాస్టార్ కొణిదెల చిరంజీవి అభిమానులను ఒకే తాటి పైకి తీసుకువచ్చి, వారిని సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో మెగా యూత్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందని మజ్జి భాస్కరరావు చెప్పారు.

మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలాస నియోజకవర్గానికి సంబంధించి మెగా యూత్ ఫోర్స్ శ్రీకాకుళం జిల్లా కో-కన్వీనర్‌గా కంచరాన అనిల్ కుమార్, పలాస నియోజకవర్గ కన్వీనర్‌గా మజ్జి భాస్కరరావు(అంబుగాం, మందస), పలాస నియోజకవర్గ కో-కన్వీనర్‌గా రూమ్కు తారకేశ్వరరావు నియమించడం జరిగిందన్నారు. ఈ నియామకాల పట్ల పలాస నియోజకవర్గ ప్రజలు, మెగా అభిమానులు, యువత హర్షం వ్యక్తం చేస్తూ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారని పేర్కొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఇంతటి గొప్ప బాధ్యతను అప్పగించిన మెగా ఫ్యామిలీకి, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చిరంజీవి స్ఫూర్తితో రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయం, విద్యార్థులకు అండగా నిలవడం, అత్యవసర సమయాల్లో సేవా కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి తమ వంతు సేవ అందిస్తామని తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో, నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వర్తిస్తామని, మెగా యూత్ ఫోర్స్ ద్వారా ఏ సేవా కార్యక్రమం అప్పగించినా ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు. మెగా ఫ్యామిలీ ఆశయాలను, చిరంజీవి సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, మెగా ఫ్యామిలీకి ఉన్న మంచి పేరు, ప్రతిష్ట మరింత ఇనుమడించేలా పనిచేస్తామని వారు తెలిపారు.

మెగా అభిమానం కేవలం అభిమానానికే పరిమితం కాకుండా... సమాజ సేవకు ఒక శక్తిగా మారాలి.. అనే లక్ష్యంతో పలాస నియోజకవర్గంలో మెగా యూత్ ఫోర్స్ ను మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.









## ఆటోడ్రైవర్ జోగారావుకు ఆటో యూనియన్ అండ

- వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం
- భరోసా ఇచ్చిన శ్రీ బంకేశ్వరమ్మ ఆటో కార్మిక యూనియన్
- భవిష్యత్తులోనూ వైద్య సేవలకు సహకరిస్తామని హామీ

**పలాస, ఆగస్టు 17 (వార్త):** అనుకోకుండా ప్రమాదానికి గురై అనారోగ్య పరిస్థితిని ఎదుర్కొంటున్న శ్రీ బంకేశ్వరమ్మ ఆటో కార్మిక యూనియన్ సభ్యుడు జోగారావును యూనియన్ నాయకులు, సభ్యులు సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జోగారావు వైద్య ఖర్చుల నిమిత్తం యూనియన్ సభ్యులందరి భాగస్వామ్యంతో సేకరించిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయనకు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో అవసరమయ్యే ఇతర వైద్య సేవలకు కూడా తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రమాదం కారణంగా అనారోగ్య పరిస్థితిని ఎదుర్కొంటున్న జోగారావును పరామర్శించి, ఆయనకు మనోధైర్యం కల్పించడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ం

ఆటో కార్మికులు పరస్పరం ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తనకు అన్నయ్య సమానులైన పిన్నింటి ఈశ్వరరావు (కాళీ) క్షేమ సమాచారం మేరకు జోగారావును పరామర్శించినట్లు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం బారువ రైతుల బాధలు



**సోంపేట, ఆగస్టు 17 (వార్త):** ఈ ఏడాది సాగునీటి కష్టాలు రైతులకు తీవ్రమయ్యాయి. ఒకవైపు వర్షాలు ముఖం చాటెయడం, మరోవైపు చెరువుల్లో చుక్క నీరు లేక వ్యవసాయానికి రైతాంగం అష్ట కష్టాలు పడుతోంది. సోంపేట మండలంలో ఎగువనున్న కొన్ని గ్రామాలు మాత్రమే నాట్లు వేయగా బారువ, పలాసపురం, తురక శాసనం, గొల్లవూరు,సోంపేట, జింకిభద్ర, బెంకిలి వంటి ప్రాంతాల్లో వేలాది ఎకరాలు ఇప్పటికీ దమ్ములు, ఉబాలకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. ఏటుబట్టి నీరు రావడానికి కూడా బారువ రైతులకు కష్టతరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఏటిబట్టిలో విపరీతంగా గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నీరు ప్రవహించక ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. భయంకరమైన బట్టిలో సాగునీటి కోసం రైతులే గుర్రపు డెక్క తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీనిపట్ల రైతాంగం నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రైతు సంక్షేమం పట్ల కబుర్లే తప్ప పనులు చేపట్టక పోవడం దారుణమని అంటున్నారు. కొన్ని ప్రాంతాలకు రైతులు కూడా వెళ్లలేక అధిక డబ్బులు చెల్లించి కూలీలకు పెట్టి ఏటిబట్టిలో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా బారువ రైతాంగానికి కూడా తీవ్ర సాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి.

## మెగా యూత్ ఫోర్స్‌లో ప్రదీప్‌కు పగ్గాలు

**సోంపేట, ఆగస్టు 17 (వార్త):** మెగా కుటుంబం ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటైన మెగా యూత్ ఫోర్స్ లో సోంపేట కు చెందిన దీన ప్రదీప్ కు కొత్తగా పగ్గాలు అప్పగించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ గా ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. కన్వీనర్ గా కవిటికి చెందిన గంతిమోహన్ నియమితులయ్యారు. ఇప్పటికే జనసేన పార్టీలో యువ నాయకుడిగా ప్రదీప్ విశేష సేవలు అందిస్తున్నారు. ప్రదీప్ మండల స్థాయిలోనూ పార్టీ ప్రతినిధి గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అలాగే వివిధ సామాజిక సేవల్లోనూ ప్రదీప్ ముందు వరుసలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రదీప్ ను కొత్తగా ఏర్పాటు చేసిన మెగా యూత్ ఫోర్సులో ప్రతినిధిగా నియమించడం విశేషం. స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రదీప్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.





## అపరిచిత వ్యక్తుల సమాచారం అందజేయాలి

**జి.సిగడాం, ఆగస్టు 17(వార్త):** గ్రామాలలో బైకులు, ఆటోలలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై అప్పలసూరి అన్నారు. సోమవారం స్థానక పోలీస్ స్టేషన్ లో ఆయెన విలేఖర్లుతో మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. దొంగతనాల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన చెప్పారు. గ్రామాల్లో అనుమానితుల సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉద్యోగాలు సాధించేందుకు పోటీపడి చదువు కోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

## డయాలసిస్ రోగికి ఆర్థికసాయం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (వార్త):** యువభారత్ సేవా ఫౌండేషన్ (తేలుకుంచి) ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు.

అరకపద్ర గ్రామానికి చెందిన తెలగ సంధ్య డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబానికి చెందిన తెలగ సంధ్య వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, వారి కుటుంబానికి అండగా నిలుస్తూ యువభారత్ సేవా ఫౌండేషన్ తరపున 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.



## పేదరికం కారణంగా ఎవరూ జైలులో ఉండకూడదు

**శ్రీకాకుళం, ఆగస్టు 17 (వార్త):** పేదరికం కారణంగా ఏ ఒక్క ఖైదీ కూడా జైలులోనే మగ్గిపోకూడదనే ఉద్దేశంతో 'సపోర్ట్ ఆఫ్ పూర్ ప్రిజనర్స్-2025' పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం జైలు, పోలీసు, న్యాయ శాఖల ఉన్నతాధికారులు, సీనియర్ న్యాయవాదులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జరిమానా చెల్లించలేక జైలులోనే మగ్గుతున్న పేద ఖైదీలను తక్షణమే గుర్తించి, ప్రభుత్వ నిధుల ద్వారా ఆ మొత్తాన్ని చెల్లించి వారిని విడుదల చేయాలని సూచించారు. చిన్న చిన్న నేరాలకు సంబంధించి సుదీర్ఘకాలంగా జైలులో ఉన్న వారి కేసులకు ప్రాధాన్యమిచ్చి బెయిల్, విడుదల ప్రక్రియలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్ కేసులు ఉన్న పేద ఖైదీలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయవాద సేవలు అందిస్తామని కార్యదర్శి పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన అనంతరం వారు సమాజంలో గౌరవంగా జీవించేందుకు వీలుగా నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఈ మానవతా పథకాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్షలో జిల్లా జైలు సూపరింటెండెంట్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ పి. శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546